సాక్షి
ఖమ్మం
శనివారం । 14 । సెప్టెంబర్ । 2024



ఆమే.. అధికం!

గ్రామపంచాయతీల వారీగా ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల చేయగా అన్ని మండలాల్లో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. 8లో



అథ్లెటిక్స్ పోటీలకు స్పందన

జిల్లా స్థాయి జట్లను ఎంపిక చేసేందుకు నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీలకు పెద్ద సంఖ్యలో క్రీడాకారులు హాజరయ్యారు. 8లో

గరిష్టం / కనిష్టం
33° / 22°

వాతావరణం

జిల్లాలో శనివారం ఎండ తీవ్రంగా ఉండే అవకాశముంది. ఉదయం నుంచే ఎండ ప్రభావం మొదలై మధ్యాహ్నానికి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి రాజగోపాల్

ఖమ్మం లీగల్: రుణ వసూళ్ల వివాదాల పరిష్కారం కోసం బ్యాంకర్లు జాతీయ లోక్ అదాలత్‌ను వేదికగా చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి.రాజగోపాల్ సూచించారు. ఈనెల 28న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనుండగా, శుక్రవారం ఆయన బ్యాంకు అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ బకాయిదారులు గడువు కోరే కేసులను ప్రీ లిటిగేషన్ విధానంలో లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకుంటే అవార్డు లభిస్తుందని చెప్పారు. ఆ తర్వాత బకాయిదారులు రుణం చెల్లిస్తే అవార్డు కోర్టు ద్వారా అమలు చేసుకోవచ్చన్నారు. అంతేకాకుండా రుణవసూళ్లపై సులభ వాయిదాలు, వడ్డీ మాఫీ ప్రకటిస్తే అత్యధిక కేసులు పరిష్కారమవుతాయని తెలిపారు.

జిల్లా సంక్షేమాధికారిగా స్వర్ణలత లెనినా



జే.ఎం. స్వర్ణలత లెనినా

ఖమ్మంవన్‌టౌన్: జిల్లా సంక్షేమాధికారిగా జే.ఎం.స్వర్ణలతా లెనినాను నియమిస్తూ శాఖ ముఖ్య కార్యదర్శి వాకాటి కరుణ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ములుగు జిల్లా ఇన్‌చార్జ్ డీడబ్ల్యూఓగా ఉన్న స్వర్ణలతకు ఏడీగా పదోన్నతి కల్పించి ఖమ్మం డీడబ్ల్యూఓగా బదిలీ చేశారు. అయితే, ఇక్కడ సంక్షేమాధికారిగా కొనసాగుతున్న రాంగోపాల్‌రెడ్డిని ఎక్కడ రిపోర్ట్ చేయాలో ఉత్తర్వుల్లో వెల్లడించలేదు. దీంతో ఆయన శనివారం రిలీవ్ అవుతారా లేదా అనేది సందిగ్ధంగా మారింది. మల్టీజోన్‌లో మరో నాలుగు జిల్లాలకు సైతం డీడబ్ల్యూఓలను నియమించగా, ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్న అధికారులు ఎక్కడ రిపోర్ట్ చేయాలో వెల్లడించకపోవడం శాఖ ఉద్యోగుల్లో చర్చనీయాంశంగా మారింది.

అంతకు మించి వర్షం!

ఈ సీజన్‌లో జిల్లాలో కుండపోత వర్షాలు కురిశాయి. ఏడాదంతా పడాల్సిన వర్షంలో 34శాతం వర్షం పది రోజుల్లో.. మొత్తం వర్షం నాలుగు నెలల్లోనే కురిసింది. జిల్లా చరిత్రలో ఇది రికార్డుగా మిగిలింది. మునుపెన్నడూ లేని విధంగా ఈ నెలలో అత్యధిక వర్షపాతం నమోదైంది. ఈనెల 10వ తేదీ వరకు సగటు వర్షపాతం 5.8 సెం.మీ. కాగా అనూహ్యంగా 34 సెం.మీ. వర్షం కురిసింది. ఈ వర్షాలతో భారీగా వరదలు రాగా జిల్లా వణికిపోయింది. పంటలు నీట మునగగా, పదుల సంఖ్యలో కాలనీలను వరద ముంచెత్తడంతో ప్రజలు నిరాశ్రయులయ్యారు. – సాక్షిప్రతినిధి, ఖమ్మం



మున్నేటి వరద ముంచెత్తిన పెదతండా పరిసరాలు (ఫైల్)

పది రోజుల్లో నాలుగు నెలల వాన

- ఫలితంగా భారీగా వరద, ముంచెత్తిన ప్రవాహం
- ఈ ఏడాది సగటు వర్షపాతం 104సెం.మీ.
- ఈనెల మొదటి పది రోజుల్లోనే 34.8 సెం.మీ.గా నమోదు
- జిల్లా చరిత్రలోనే ఈ సీజన్‌లో రికార్డు నమోదు

దంచి కొట్టాయి..

ఈనెల 1 నుంచి 10వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. ఈ ప్రభావంతో జిల్లాలో విపత్కర పరిస్థితులు నెలకొన్నాయి. మున్నేరు, ఆకేరు, పాలేరు, వైరా, కట్టలేరు పొంగి పరీవాహక ప్రాంతాలు నీటమునగడంతో తీవ్రమైన నష్టం వాటిల్లింది. పాలేరు, ఖమ్మం, మధిర, వైరా నియోజకవర్గాలపై ఈ వర్షాలు ప్రభావం చూపాయి. వేలాది ప్రజలు ఇళ్లు కోల్పోయి నిరాశ్రయులు కాగా, విలువైన సామగ్రి, నగదు కోల్పోయారు. దశాబ్దాల చరిత్రలో ఇంతటి విపత్తు ఎన్నడూ నమోదు కాలేదని రికార్డుల ద్వారా తెలుస్తోంది.

ఆరు రెట్లు ఎక్కువ

జిల్లాలో ఈ నెల 10వ తేదీ వరకు వరకు సాధారణ వర్షపాతం కంటే ఆరు రెట్లు ఎక్కువగా నమోదైంది. ఈ సమయాన 5.8 సెం.మీ.కు బదులు 34.8 సెం.మీ.గా నమోదైంది. వాతావరణంలో విభిన్న పరిస్థితులు, ఉపరితల ఆవర్తనంతో భారీ వర్షాలు కురిసినట్లు అధికారులు చెబుతున్నారు. గత ఏడాది సెప్టెంబర్‌లో సగటు సాధారణ వర్షపాతం 18.3 సెం.మీ.కాగా.. 15.4 సెం.మీ. కురిస్తే ఈ ఏడాది సెప్టెంబర్‌లో కేవలం పది రోజుల్లోనే రెట్టింపు వర్షపాతం నమోదైంది.

ఎర్రుపాలెంలో అత్యధికం


జిల్లా మొత్తంగా గడిచిన పది రోజుల్లో సగటున 34.8 సెం.మీ. వర్షపాతం నమోదైతే ఇందులో అత్యధికంగా ఎర్రుపాలెం మండలంలో 46.2 సెం.మీ.గా ఉంది. ఈ కారణంగా ఎర్రుపాలెంలోని వాగులు పొంగి పొర్లడంతో పాటు పంటలు, రహదారులు దెబ్బతిన్నాయి. కూసుమంచిలో 43.8, మధిరలో 43, తల్లాడలో 42.4, తిరుమలాయపాలెం మండలంలో 38.2 సెం.మీ. వర్షపాతం నమోదైంది. తల్లాడ మినహా మిగిలిన ప్రాంతాల్లో వర్షానికి తోడు ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరదతో ఇళ్లు మునిగిపోయాయి. అంతేకాక పంట పొలాల్లోని సారవంతమైన మట్టి కొట్టుకుపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు.

ఇప్పటికే 113 సెం.మీ.

జిల్లాలో ఏడాది సగటు వర్షపాతం 104.2 సెం.మీ. అయితే గత ఏడాది 94.7 సెం.మీ.గా నమోదైంది. ఈ ఏడాది మాత్రం జూన్, జూలై, ఆగస్టుతోపాటు సెప్టెంబర్‌లో పది రోజులు కలిపి మొత్తంగా 113.7 సెం.మీ. వర్షం కురిసింది. గత ఏడాది వర్షపాతం కన్నా ఇది ఎక్కువ కావడం విశేషం. ఈ సీజన్ మూడు నెలల పది రోజుల్లో 58 రోజుల పాటు వర్షాలు కురవగా 68.1 సెం.మీ. సగటు వర్షపాతానికి గాను అంతకు మించి నమోదైంది. ఈ ఏడాది జూన్‌లో 19.8, జూలైలో 30.3, ఆగస్టులో 28.6, సెప్టెంబర్‌లో ఇప్పటి వరకు 34.8 సెం.మీ. వర్షపాతం నమోదు కాగా.. జిల్లా చరిత్రలోనే ఇది అత్యధికమని చెబుతున్నారు.



ఖమ్మం రూరల్ మండలంలో ఇసుక మేటలు వేసిన మిరపతోట (ఫైల్)



జూన్ నుంచి ఇప్పటి వరకు సాధారణ, నమోదైన వర్షపాతం (సెం.మీ.ల్లో)

ఈనెల మొదటి పది రోజుల్లో అత్యధిక వర్షపాతం వివరాలు (సెం.మీ.ల్లో)

మండలం	వర్షపాతం
ఎర్రుపాలెం	46.2
కూసుమంచి	43.8
మధిర	43.0
తల్లాడ	42.4
వైరా	39.8
కారేపల్లి	39.3
కల్లూరు	38.7
వేంసూరు	37.8
చింతకాని	37.0
తిరుమలాయపాలెం	36.2
ఖమ్మం	34.5

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. శనివారం ఉదయం 10గంటలకు కూసుమంచి మండలం హట్యాతండాలో పాలేరు ఎడమ కాల్వకు గండి పడిన ప్రదేశాన్ని పరిశీలించి మరమ్మతులపై సమీక్షిస్తారు. ఆతర్వాత గట్టుసింగారంలో స్వాతంత్య్ర సమరయోధుడు రామిరెడ్డి కుటుంబాన్ని మంత్రి పరామర్శిస్తారు. సాయంత్రం 5గంటలకు సత్తుపల్లి నియోజకవర్గం, రాత్రి 7.30గంటలకు కొత్తగూడెం నియోజకవర్గంలోని పలు వినాయక మండపాలను మంత్రి సందర్శించి పూజలు చేస్తారని క్యాంపు కార్యాలయ ఇంచార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి తెలిపారు.

అర్హులైన ప్రతీ ఒక్కరికి ఓటుహక్కు

- అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్



సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ఖమ్మంరూరల్: వచ్చే ఏడాది జనవరి 1నాటికి 18 ఏళ్ల వారందరికీ ఓటుహక్కు కల్పించేలా పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్‌నాయక్ ఆదేశించారు. మండలంలోని రెడ్డిపల్లిలో క్షేత్రస్థాయి సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో జరిగే గ్రామపంచాయతీ జరగనున్నందున ఓటరు జాబితా రూపకల్పనకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు ఇచ్చిందని తెలిపారు. ఈమేరకు అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడమే కాక జాబితాలో తప్పుల సవరణ, చిరునామా మార్పులపై బూత్ లెవల్ అధికారులు దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. ఎన్నికల విభాగం డీటీ రవీందర్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

'పేట' చెరువు అభివృద్ధికి ప్రణాళిక



చెరువు వద్ద పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

ఎర్రుపాలెం: మండలంలోని మామునూరు పేట చెరువును పర్యాటక శాఖ ఎండీ యు.ఉపేందర్‌రెడ్డి, ఎస్‌ఈ సరిత శుక్రవారం పరిశీలించారు. ఈ చెరువును అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు గాను డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఈ ఏడాది ఫిబ్రవరిలో రూ.9 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో చేపట్టాల్సిన పనులను ప్రణాళిక రూపొందించేందుకు గాను ఎండీ పరిశీలించారు. చెరువు కట్టను బలోపేతం చేయడమే కాక కాటేజీలు నిర్మించి సైక్లింగ్, బోట్ షికార్ ఏర్పాటుకు త్వరలో టెండర్లు ఆహ్వానించే అవకాశముంది. జిల్లా పర్యాటక శాఖాధికారి సుమన్, తహసీల్దార్ ఉషాశారద, ఉద్యోగులు రామకృష్ణ, స్మిత, సీహెచ్.రామకృష్ణ, సాంబశివరావు, అనూజతో పాటు కాంగ్రెస్ నాయకులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, అనుమోలు కృష్ణారావు, శీలం వెంకట్రామిరెడ్డి, తల్లపురెడ్డి నాగిరెడ్డి, వై.శ్రీనివాసరెడ్డి, షేక్ జానీబాషా తదితరులు పాల్గొన్నారు.

విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మం సహకారనగర్: పంచాయతీలు, మున్సిపాలిటీల అధికారులు విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆమె ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, మండల పంచాయతీ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్రామపంచాయతీల వారీగా ఓటరు జాబితాపై అభ్యంతరాలను నమోదు చేయాలని తెలిపారు. అలాగే, బదిలీ అయిన పంచాయతీ కార్యదర్శులను రిలీవ్ చేసి నూతన స్థానాల్లో చేరేలా పర్యవేక్షించాలని సూచించారు. ఈనెల 17న ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా ప్రతీ గ్రామపంచా యతీ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించాలని, మున్సిపాలిటీలు, మండలా ల్లో పారిశుద్ధ్య నిర్వహణ, పచ్చదనం పెంపుపై దృష్టి సారించాలని తెలిపారు. అలాగే, తాగునీటి సరఫరా నాణ్యత, దోమల నివారణకు ఫాగింగ్‌ను పర్యవేక్షిస్తూనే లేఔట్, భవన నిర్మాణ అనుమతుల జారీ విషయంలో నిబంధనలు పాటించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ బి.నాగలక్ష్మి, డీపీఓ ఆశాలత, డీఎస్‌ఓ చందన్‌కుమార్, డీఎల్‌పీఓ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

'గ్యారంటీ'ల అమలుపై ప్రత్యేక స్టాళ్లు

- ప్రజాపాలన దినోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు
- అధికారులతో సమీక్షలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, పక్కన సీపీ సునీల్‌దత్

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని ఈనెల 17న పండుగ వాతావరణంలో నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్‌తో కలిసి ఆయన వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 17న ఉదయం 10 గంటలకు పరేడ్ మైదానంలో జరిగే ప్రజాపాలన దినోత్సవంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారన్నారు. ఈమేరకు ఏర్పాట్లను సోమవారం కల్లా పూర్తిచేయాలని, అభయ హస్తం గ్యారంటీల అమలుపై స్టాళ్లు సిద్ధం చేయాలని సూచించారు. అంతేకాక అన్ని శాఖల జిల్లా కార్యాలయాలు, గ్రామపంచాయతీలు, మున్సిపల్ కార్యాలయాల్లో జాతీయ పతాకావిష్కరణ నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.

ఉద్యోగుల సేవలు ప్రశంసనీయం

జిల్లాలో భారీ వరదలు వచ్చిన సమయాన అధికారులు, ఉద్యోగులు ప్రజలకు చేసిన సేవలు ప్రశంసనీయమని కలెక్టర్ అభినందించారు. కొందరు ఉద్యోగులు, సిబ్బంది ఇళ్లు నీట మునిగినా సహాయక చర్యల్లో పాల్గొన్నారని తెలిపారు. ఆతర్వాత పోలీసు కమిషనర్ సునీల్‌దత్ మాట్లాడుతూ ఆపద కాలంలో ప్రజలకు అన్ని శాఖల ఉద్యోగులు చేసిన సేవలు మరువలేనివని చెప్పారు.

గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా పూర్తిచేయాలి

ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనం పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. నిమజ్జన ఏర్పాట్లపై అధికారులతో ఆయన సమీక్షించారు. ఈనెల 16న వినాయక నిమజ్జనం జరగనుండగా, మంగళవారం కూడా కొనసాగుతుందని తెలిపారు. ఖమ్మంతో పాటు వైరా, సత్తుపల్లి, మధిర మున్సిపాలిటీల్లో అవసరమైన ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేయాలని, ఉత్సవ కమిటీల బాధ్యులు, గ్రామ పెద్దలతో ముందస్తుగా సమావేశాలు నిర్వహించి సూచనలు ఇవ్వాలని తెలిపారు. అలాగే, నిమజ్జనం జరిగే ప్రాంతాల్లో అవసరమైన ఏర్పాట్లు చేసి విద్యుత్ సౌకర్యం కల్పించడమే కాక క్రేన్లు అందుబాటులో ఉంచాలని, గజఈతగాళ్లు, వైద్య, ఆరోగ్య సిబ్బందిని నియమించాలని సూచించారు. సీపీ సునీల్‌దత్ మాట్లాడుతూ 16న వెయ్యికి పైగా విగ్రహాలు, 17న 800 నుండి 900 వరకు విగ్రహాలు నిమజ్జనం అయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఈ సమావేశాల్లో అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, డి.మధుసూదన్ నాయక్, డీఎఫ్‌ఓ సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, అసిస్టెంట్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ, డీఆర్వో ఎం.రాజేశ్వరి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో పంటల రక్షణ

- పంట చేలలో నిల్వ నీటిని తొలగించాలి
- పత్తికి పోషకాలు అందిస్తేనే మనుగడ
- వరిలో తెగుళ్ల నివారణపై ప్రత్యేక దృష్టి
- 'సాక్షి' ఫోన్ ఇన్‌లో అధికారుల సూచనలు



ఫోన్ ఇన్ కార్యక్రమంలో రైతుల సందేహాలను నివృత్తి చేస్తున్న వ్యవసాయ, ఉద్యాన అధికారులు, శాస్త్రవేత్తలు

ఖమ్మంవ్యవసాయం: పది రోజుల పాటు కురిసిన వర్షాలతో పంట చేలల్లోకి వరద చేరింది. అంతేకాక తేమ కారణంగా పంటలను తెగుళ్లు ఆశిస్తున్నాయి. వరద నీరు పంట చేలల్లోకి చేరి రోజుల తరబడి నిల్వ ఉండడంతో పూత, కాత దశలో ఉన్న పత్తి, దుబ్బు దశలో వరి, మొక్కదశలో మిరప దెబ్బతిన్నాయి. ఈనేపథ్యాన సమగ్ర సస్యరక్షణ చర్యలతో పంటలను రక్షించుకోవచ్చని వ్యవసాయ, ఉద్యాన, అధికారులు, శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. పంటల్లో యాజమాన్య పద్ధతులపై రైతులకు సూచనలు అందించాలనే లక్ష్యంతో 'సాక్షి' అధికారులతో శుక్రవారం ఫోన్ ఇన్ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో రైతులు ఫోన్ చేసి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. రైతుల సందేహాలకు జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్యతో పాటు జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి ఎం.వీ.మధుసూదన్, వైరా కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ రవికుమార్, రైతు శిక్షణా కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ అభిమన్యుడు సమాధానాలు ఇచ్చారు. ఇందులో కొన్ని ప్రశ్నలు, జవా బులు ఇలా ఉన్నాయి.

ప్రశ్న: వర్షాలు, వరదతో పంట పూర్తిగా కొట్టుకుపోయింది. ఆ స్థానంలో ప్రస్తుతం ఇతర పంటలను ఎప్పటివరకు వేసుకోవచ్చు?

– గరిడేపల్లి రామారావు, సుర్దేపల్లి, నేలకొండపల్లి మండలం

జవాబు: ప్రస్తుతం పంటలను సాగు చేసుకునే సమయమే. మినుము, పెసర వేసుకునే అవకాశం ఉంది. నేల రకాన్ని పంటను ఎంచుకోవాలి.

ప్ర: పత్తి ఆకు గడుసు బారి ఎదుగుదల ఆశాజనకంగా లేదు. పైరు తేలిపోయినట్టుగా మారింది. దీని నివారణకు ఏం చేయాలి?

– రాంరెడ్డి, కమలాపురం, ముదిగొండ మండలం

జ: ప్రస్తుతం ఉష్ణోగ్రత పెరిగిన కారణంగా పత్తిలో ఈ లక్షణాలు కనిపిస్తాయి. పోషకాలను అందిస్తే పైరు పూర్వ స్థితికి చేరే అవకాశముంది. మొక్కకు అడుగు దూరంలో యూరియా, పొటాష్ ఎరువులు వేసుకోవాలి.

ప్ర: వర్షాలతో చనిపోతున్న మిర్చి తోటల స్థానంలో మళ్లీ తోటలు వేసుకోవచ్చా?

– మిర్యాల విక్రమ్ రెడ్డి, బీరోలు, తిరుమలాయపాలెం మండలం

జ: ప్రస్తుతం మిర్చి నాటుకునే సీజనే. నారు లభ్యత ఉంటే మిర్చి వేసుకోవచ్చు.

ప్ర: పత్తిలో పూత రాలుతుండడమే కాక పైరు ఎర్రగా మారి వడబడింది. ఏం చేయాలి?

– సింగు హన్మంతరావు, పెద్దమండవ, మల్లం అంబయ్య, ముష్టికుంట్ల, రాకేష్‌రెడ్డి, మర్లపాడు

సాక్షి ఫోన్ ఇన్

జ: పైరులో నీరు నిల్వ ఉంటే వెంటనే కాల్వల ద్వారా తొలగించాలి. అధిక తేమ కారణంగా ఈ పరిస్థితి నెలకొంటోంది. పంటకు పోషకాలను అందించాలి. పత్తి పూత సమయాన పొటాషియం నైట్రేట్, 13-0-13, 19:19:19 వంటి ఎరువులు వేయాలి. ఎకరాకు మూడు కిలోల యూరియా, పొటాష్‌ను మొక్క మొదలు వద్ద వేసుకోవాలి. ప్లానోఫిక్స్ పిచికారీ చేసినా పూత నిలుస్తుంది. పాటు కూడా చేసుకోవాలి.

ప్ర: వర్షాల కారణంగా చౌడు తేలి వరి పంట దెబ్బతింటోంది. అక్కడక్కడా దుబ్బులు చనిపోతున్నాయి. దీనిని నివారణకు సలహా ఇవ్వగలరు.

– శీలం నాగిరెడ్డి, దాచాపురం, శోభన్‌బాబు, శ్రీరాంపురం

జ: పైరు దుబ్బు దశలో ఉన్నప్పుడు చౌడు కారణంగా ఆకుఎండు తెగులు వస్తుంది. దీని నివారణకు ప్లాంటామైసిన్ పిచికారీ చేయాలి. ఎకరాకు 10 నుంచి 15 కిలోల వరకు పొటాష్ వేసుకోవాలి. పంట సాగుకు ముందు చౌడు నివారణ చర్యలు చేపడితే ఈ పరిస్థితి ఎదురుకాదు.

ప్ర: మిరపకు ఎండు తెగులు ఆశిస్తోంది. అక్కడక్కడ కుళ్లిపోయి మొక్కలు చనిపోతున్నాయి.

– గోపాల్, ముష్టికుంట్ల, నర్సింహారావు, మల్లాపురం తండా

జ: తేమ ఎక్కువగా ఉన్నప్పుడు ఇలాంటి సమస్యలు వస్తాయి. బ్లైటాక్స్, కాపర్ పిచికారీ డబ్బాలో పోసి నాజిల్ తీసి మొక్క మొదట్లో ధార పడేలా పోయాలి. పైరుకు గాలి, వెలుతురు అందేలా చూడాలి. తేమ ఆరిన వెంటనే పైపాటు చేయాలి.

ప్ర: చెరువు పక్కన వరి పైరు ఉండడంతో నీటి కోళ్లు తొక్కడంతో దెబ్బతింటోంది. ఎలా నివారించుకోవాలి?

– సత్యనారాయణ రావు, బోనకల్

జ: మెరిసే రిబ్బన్లు, కుర్‌కురే వంటి ప్యాకెట్ల కవర్లు పొలంలో అక్కడక్కడా తగిలించాలి. రిఫ్లెక్షన్ రిబ్బన్లను పొలంలో వేలాడదీయాలి. దీంతో నీటి కోళ్లు బెదిరిపోతాయి. ఎకరాకు 3జీ గుళికలను 10 కిలోలు వేసినా ఆ వాసనకు రాకుండా ఉంటాయి. ఈ గుళికలు పైరుకు కూడా మంచిది.

ప్ర: వర్షాల కారణంగా వరి పైరులో మూడు రోజులు నీరు నిలిచింది. ఆపై జింక్ లోపం కనబడుతోంది. దీని నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టాలి?

– మల్లికార్జున్‌రెడ్డి, మీనవోలు, ఎర్రుపాలెం మండలం

జ: పైరులోని నీటిని తొలగించి కొత్త నీరు అందించాలి. ప్లాంటామసిన్ ఎకరాకు 80 గ్రాములు పిచికారీ చేయాలి. ఎకరాకు 20 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ వేసుకోవాలి.

ప్ర: పాలేరు వరదతో వరి పైరు పూర్తిగా దెబ్బతిన్నది. పరిహారం విషయంలో కౌలు రైతుల పరిస్థితి ఏమిటి?

– వీరబోయిన సోమయ్య, సుర్దేపల్లి, నేలకొండపల్లి మండలం

జ: తగిన ఆధారాలతో ఏఈఓలను సంప్రదించండి. పట్టాదారు నుంచి కౌలుకు తీసుకున్నట్లు ఆధారాలు ఉంటే పంట నష్టం కింద ధ్రువీకరిస్తారు.

ప్ర: వరిలో నీరు నిలిచి చల్లతెగులు ఆశించింది. అక్కడక్కడ పైరు చనిపోతోంది. నివారణ చర్యలు తెలపండి.

– మల్లెబోయిన ఉపేందర్, బైరవునిపల్లి, పసుమర్తి శ్రీనివాస్, నేలకొండపల్లి, సుధాకర్‌రెడ్డి, మల్లాయిగూడెం, వెంగళరావు, మంగాపురం తండా

జ: పైరు నీట మునిగినప్పుడు ఆకు ఎండు తెగులు, బ్యాక్టీరియా తెగుళ్లు వంటివి ఆశిస్తాయి. నివారణకు ప్లాంటోమైసిన్ 80 గ్రాములు, 2 గ్రాముల కాపర్‌ను లీటర్ నీటిలో కలిపి ఎకరాకు వారంలో రెండుసార్లు పిచికారీ చేయాలి. దీంతో పాటు ఎకరాకు 15 కిలోల పొటాష్ ఎరువు వేయాలి.

క్లుప్తంగా

ముంపు బాధితులకు రేషన్ డీలర్ల చేయూత


కలెక్టర్‌కు చెక్కు అందజేస్తున్న డీలర్ల సంఘం నాయకులు

ఖమ్మం సహకారనగర్: మున్నేరు వరద బాధితుల సహాయార్థం కలెక్టర్ పిలుపు మేరకు 'నా ఖమ్మం కోసం నేను' కార్యక్రమంలో భాగంగా జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం నాయకులు రూ.లక్ష చెక్కు అందజేశారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు శుక్రవారం సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బానోత్ వెంకన్న, షేక్ జానీమియా చెక్కు అందజేయగా ఆయన అభినందించారు. పోలీస్ కమిషనర్ సునీల్‌దత్, అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, సంఘం బాధ్యులు దొండ దుర్గయ్య, వెంకటరెడ్డి, బిందుమాధవి, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా ఐఎంఏ కమిటీ ఎన్నిక


నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి

ఖమ్మంవైద్యవిభాగం: ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) ఖమ్మం కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఈమేరకు ఐఎంఏ అధ్యక్షుడిగా డాక్టర్ కంభంపాటి నారాయణరావు, కార్యదర్శిగా డాక్టర్ జగదీశ్‌బాబు, కోశాధికారిగా డాక్టర్ గుబ్బల స్వప్న ఎన్నికయ్యారు. రెండేళ్ల పాటు కొనసాగే ఈ కమిటీ బాధ్యులకు పలువురు వైద్యులు శుభాకాంక్షలు తెలిపారు.

ఖమ్మం ఆర్అండ్‌బీ ఈఈగా యుగంధర్


బాధ్యతలు స్వీకరిస్తున్న యుగంధర్

ఖమ్మంఅర్బన్: ఖమ్మం డివిజన్ ఆర్అండ్‌బీ ఈఈగా వి.యుగంధర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇన్నాళ్లు ఈఈగా ఎస్ఈ హేమలత అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తుండగా ఇటీవల వరదలతో దెబ్బతిన్న రహదారుల మరమ్మతుల పనులను ఆమె పర్యవేక్షించాల్సి వస్తోంది. దీంతో జాతీయ రహదారుల ఈఈ యుగంధర్‌కు ఆర్అండ్‌బీ ఈఈగా అదనపు బాధ్యతలు అప్పగించినట్లు తెలిసింది. ఈ మేరకు ఆయన శుక్రవారం విధుల్లో చేరారు.

పాఠశాలలో ఏటీడబ్ల్యూఓ తనిఖీ


విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న ఏటీడబ్ల్యూఓ

కారేపల్లి: మండలంలోని లావుద్యాతండా జీపీఎస్‌ను ఏటీడబ్ల్యూఓ జహీరుద్దీన్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించిన ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఏటీడబ్ల్యూఓ మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించడమే కాక పౌష్టికాహారం అందిస్తూ మెరుగైన బోధన అందిస్తున్నామని తెలిపారు. జీపీఎస్ హెచ్ఎం కేలోతు రాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖమ్మం మార్కెట్‌కు నాలుగు రోజుల సెలవులు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు శనివారం నుంచి వరుసగా నాలుగు రోజుల పాటు సెలవులు ప్రకటించారు. శనివారం, ఆదివారం వారాంతపు సెలవులు కాగా 16న సోమవారం వినాయక నిమజ్జనం ఉండడంతో చాంబర్ ఆఫ్ కామర్స్ అభ్యర్థన మేరకు సెలవు ఇచ్చారు. అలాగే, 17న ప్రభుత్వం సెలవు ప్రకటించిందని మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి 18వ తేదీ బుధవారం నుంచి మార్కెట్‌లో కొనుగోళ్లు మొదలవుతాయని ఆయన వెల్లడించారు.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
పెసలు	7,359	4,000
పెసలు(మార్క్‌ఫెడ్)	8,682	8,682
మిర్చి	19,900	8,000
ఏసీ మిర్చి	20,000	10,700
ఏసీ తాలు	9,000	8,000
పత్తి	7,950	5,800

– ఖమ్మం వ్యవసాయం

ఆమే.. అధికం!

- గ్రామపంచాయతీల్లో మహిళా ఓటర్లే ఎక్కువ
- మొత్తం ఓటర్లు 8,51,541మంది
- ముసాయిదా జాబితా విడుదల చేసిన అధికారులు
- 21వరకు అభ్యంతరాల స్వీకరణ, 28న తుది జాబితా


ముజ్జుగూడెం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఓటర్ల జాబితాను విడుదల చేస్తున్న కార్యదర్శి

ఖమ్మంవన్‌టౌన్: గ్రామపంచాయతీ ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యాన అధికారులు ఓటరు ముసాయిదా సిద్ధం చేశారు. ఈ జాబితాను పంచాయతీల వారీగా శుక్రవారం ప్రదర్శించినట్లు జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత ప్రకటించారు. అయితే, జిల్లాలో ఇటీవల పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేయడంతో కొందరు ఇంకా నూతన స్థానాల్లో విధుల్లో చేరలేదు. ఫలితంగా మిగిలిన జీపీల్లో శనివారం ప్రదర్శించనున్నారు. జిల్లాలోని 20 మండలాలకు గాను 589 గ్రామపంచాయతీలు, 5,398 వార్డులు ఉన్నాయి. ముసాయిదా జాబితా ప్రకారం జిల్లాలో పురుష ఓటర్లు 4,12,398 మంది, మహిళలు 4,39,120 మంది ఉన్నారు. ఈమేరకు అసెంబ్లీ ఎన్నికల సమయంలో మాదిరిగానే ప్రస్తుతం కూడా జాబితాలో మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నట్లు తేలింది. ముసాయిదా ఓటరు అభ్యంతరాలను 14 నుండి 21వ తేదీ వరకు ఎంపీడీఓ కార్యాలయాల్లో సమర్పించవచ్చని డీపీఓ తెలిపారు. అభ్యంతరాల పరిశీలన, పరిష్కారం అనంతరం ఈనెల 28న తుది జాబితా ప్రకటిస్తామని వెల్లడించారు.

అన్ని చోట్ల మహిళలే ఎక్కువ

జిల్లాలోని 20 మండలాల్లో 589 గ్రామపంచాయతీలు ఉండగా అన్ని మండలాల్లో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. మొత్తం 8,51,541 మంది ఓటర్లు ఉండగా, పురుషులతో పోలిస్తే మహిళలు 26,722 ఎక్కువగా ఉన్నట్లు ముసాయిదా జాబితా ద్వారా వెల్లడైంది. ఇక ఇతరులు రఘునాథపాలెం మండలంలో ఎక్కువగా ఆరుగురు ఉన్నారు. ఇంకొన్ని మండలాల్లో ఒకరిద్దరు టర్లు నమోదు కాగా, మరికొన్ని మండలాల్లో ఆ కేటగిరీ ఓటర్లు లేరు.



మండలాల వారీగా జీపీల్లో ఓటర్ల వివరాలు

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ఖమ్మం రూరల్	37,734	40,816	04	78,554
కల్లూరు	26,176	27,473	00	53,649
తిరుమలాయపాలెం	23,874	25,478	00	49,352
నేలకొండపల్లి	23,525	25,633	01	49,159
కూసుమంచి	23,480	25,074	01	48,555
ముదిగొండ	23,086	25,024	02	48,112
తల్లాడ	22,315	23,336	01	45,652
సింగరేణి	21,925	22,860	03	44,788
పెనుబల్లి	20,990	22,086	00	43,076
కొణిజర్ల	20,103	21,176	00	41,279
చింతకాని	19,687	21,340	00	41,027
రఘునాథపాలెం	19,090	20,954	06	40,050
ఎర్రుపాలెం	19,357	20,407	01	39,765
వేంసూరు	17,964	18,579	00	36,543
బోనకల్	17,435	18,454	01	35,890
సత్తుపల్లి	17,172	18,321	00	35,493
కామేపల్లి	17,181	17,779	00	34,960
మధిర	15,059	16,084	02	31,145
ఏన్కూరు	13,236	14,340	01	27,577
వైరా	13,009	13,906	00	26,915
మొత్తం	4,12,398	4,39,120	23	8,51,541

చట్టాల రూపకల్పనలో కమ్యూనిస్టులే కీలకం

సీతారాం ఏచూరి సంస్మరణ సభలో వక్తలు



సంస్మరణ సభలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: దేశానికి దిశానిర్దేశం చేసే అనేక చట్టాల రూపకల్పనలో కమ్యూనిస్టులు కీలకంగా వ్యవహరించారని, అందులో సీతారాం ఏచూరి పాత్ర మరువలేనిదని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పేర్కొన్నారు. మార్క్సిజం విలువల కోసం పనిచేసిన వ్యక్తి ఏచూరి అని కొనియాడారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు యర్రా శ్రీకాంత్ అధ్యక్షతన ఖమ్మం సుందరయ్య భవనంలో శుక్రవారం నిర్వహించిన సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంస్మరణ సభకు వివిధ పార్టీల నాయకులు హాజరయ్యారు. తొలుత ఆయన ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించాక నాగేశ్వరరావు మాట్లాడుతూ దేశం ఓ సిద్ధాంతకర్త, దార్శనికుడిని కోల్పోయిందని చెప్పారు. సీపీఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు మాట్లాడుతూ సీతారాం ఏచూరి సిద్ధాంతం కమ్యూనిస్టులకు ప్రేరణ, స్ఫూర్తిదాయకమని, ఆయన మరణం దేశ రాజకీయాలు, లౌకిక ప్రజాస్వామ్య శక్తులకు తీరని లోటని తెలిపారు. ఐలూ రాష్ట్ర కార్యదర్శి కొల్లి సత్యనారాయణ మాట్లాడుతూ భారత రాజ్యాంగ పీఠికలో అంశాల ఆధారంగా సీతారాం ఏచూరి రచనలు చేశారని గుర్తుచేశారు. ఇంకా ఈ సమావేశంలో వివిధ పార్టీల నాయకులు పి.సోమయ్య, పోటు ప్రసాద్, గుండాల కృష్ణ, మాచర్ల భారతి, బుగ్గవీటి సరళ, కళ్యాణం వెంకటేశ్వరరావు, బండి రమేష్, వై.విక్రమ్, నల్లమల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

16న వినాయక నిమజ్జనం

ఖమ్మంగాంధీచౌక్: వినాయక నిమజ్జనాన్ని ఈనెల 16వ తేదీ సోమవారం జరుపుకునేందుకు స్తంభాద్రి ఉత్సవ సమితి నిర్ణయించింది. ఈమేరకు సమితి అధ్యక్షుడు వినోద్ లాహోటి అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో వినాయక శోభాయాత్ర, వీడ్కోలు సభ, నిమజ్జనంపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. పండితుల సూచనల మేరకు 16వ తేదీన నిమజ్జనం జరపాలని నిర్ణయించగా, ఆరోజు ఉదయం 10–30 గంటలకు మండపాల వద్ద శోభాయాత్రలు ప్రారంభించాలని నిర్వాహకులకు సూచించారు. ఆపై ఖమ్మం గాంధీచౌక్ వద్ద సార్వత్రిక గణేష్ నిమజ్జన వీడ్కోలు పలుకుతామని, అక్కడి నుంచి నుంచి కాల్వొడ్డు, ప్రకాష్‌నగర్‌ల్లో విగ్రహాలను నిమజ్జనం చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి కీసర జయపాల్ రెడ్డి, కన్వీనర్ కన్నం ప్రసన్నకృష్ణతో పాటు అల్లిక అంజయ్య, మూలగుండ్ల శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ విషయంలో అప్రమత్తంగా ఉండాలి

గణేష్ నిమజ్జనం సందర్భంగా విద్యుత్ వైర్ల విషయంలో భక్తులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఈ ఏ.సురేందర్ ఓ ప్రకటనలో సూచించారు. మండపాలకు ఏర్పాటు చేసిన వైర్లను తొలగించాక విగ్రహాలను నిమజ్జనానికి తరలించాలని, ఊరేగింపులో ఎక్కడైనా తీగలు తక్కువ ఎత్తులో ఉంటే నేరుగా తాకొద్దని తెలిపారు. సమస్యలు ఎదురైతే సంబంధిత విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అంతేకాక విద్యుత్ కంట్రోల్ రూమ్ 94408 11525కు సమాచారం ఇవ్వొచ్చని ఎస్ఈ తెలిపారు.

ప్రిన్సిపాళ్ల సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్


శ్రీనివాస్, అధ్యక్షుడు


నవీనజ్యోతి, కార్యదర్శి

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల సంఘం జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఖమ్మంలోని శాంతినగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా వాసిరెడ్డి శ్రీనివాస్, కార్యదర్శిగా ఎల్.నవీన జ్యోతిని ఎన్నుకున్నారు. అంతేకాక ఉపాధ్యక్షులుగా ఎం.సింహాచలం, సంయుక్త కార్యదర్శిగా ఆర్.రవికుమార్, కోశాధికారిగా ఆర్.గోవిందరావు, మహిళా కార్యదర్శిగా ఎస్.విజయకుమారి, కార్యవర్గ సభ్యుడిగా కేఎస్.రామారావు తదితరులు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా పి.శంకర్, ఎం.సతీష్ వ్యవహరించారు.

అథ్లెటిక్స్ ఎంపిక పోటీలకు అనూహ్య స్పందన

జిల్లా నలుమూలల నుంచి 294 మంది హాజరు


ఎంపిక పోటీలకు హాజరైన అథ్లెట్లు


పరుగుపందెంలో పాల్గొన్న బాలికలు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లాస్థాయి అథ్లెటిక్స్ జట్ల ఎంపికకు నిర్వహించిన పోటీలకు అనూహ్య స్పందన లభించింది. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో శుక్రవారం అండర్–14, 16, 18, 20 బాలబాలికల జట్ల ఎంపికకు పోటీలు నిర్వహించారు. ఈ మేరకు వివిధ ప్రాంతాల నుంచి 156 మంది బాలురు, 138 మంది బాలికలు హాజరయ్యారు. దీంతో ఎంపిక ప్రక్రియ కష్టతరంగా మారింది. ఎట్టకేలకు సాయంత్రం వరకు జట్ల ఎంపిక పూర్తిచేశారు. ఆయాజట్లు ఈనెల 19, 20వ తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు. ఖమ్మం అథ్లెటిక్స్ అకాడమీ చీఫ్ కోచ్ ఎం.డీ.గౌస్, అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మందుల వెంకటేశ్వర్లు, ఎం.డీ.షఫీక్ అహ్మద్, సభ్యులు ఎం.సుధాకర్, రవి, ముజాహిద్, కృష్ణయ్య, నవీన్ పర్యవేక్షించారు.

జూనియర్ కళాశాలల్లో ప్రత్యేక తరగతులు


ప్రిన్సిపాళ్లకు సూచనలు చేస్తున్న డీఐఈఓ

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడంతో పాటు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి(డీఐఈఓ) రవిబాబు సూచించారు. ఖమ్మంలోని ఏఎస్ఆర్ శాంతినగర్ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఆయన ప్రిన్సిపాళ్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీఐఈఓ మాట్లాడుతూ విద్యార్థులు గైర్హాజరైతే తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి హాజరయ్యేలా చూడాలని తెలిపారు. అలాగే, స్టడీ అవర్స్ ఏర్పాటుచేసి ఎప్‌సెట్, జేఈఈ, నీట్‌కు శిక్షణ ఇవ్వాలని, స్టూడెంట్ కౌన్సిలర్ల ద్వారా సూచనలు చేయాలని చెప్పారు. అంతకాక కళాశాలల్లో యువ టూరిజం క్లబ్‌లు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు.

కానిస్టేబుల్ విధులను అడ్డుకున్న యువకుడి అరెస్ట్

నేలకొండపల్లి: కానిస్టేబుల్ విధులను అడ్డుకోవడమే కాక దురుసుగా ప్రవర్తించిన యువకుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై పి.సంతోష్ తెలిపారు. నేలకొండపల్లిలో విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్‌ను అడ్డగించిన మహేష్ కర్రతో బెదిరించాడు. దీంతో కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు మహేష్‌ను శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

చెల్లని చెక్కు జారీ చేసిన కేసులో జైలుశిక్ష

ఖమ్మం లీగల్: తీసుకున్న అప్పు చెల్లించే క్రమాన ఇచ్చిన చెక్కు చెల్లకపోవడంతో మూడు నెలల జైలు శిక్ష విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు ప్రథమ శ్రేణి కోర్టు న్యాయాధికారి బిక్కం రజని శుక్రవారం తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం రూరల్ మండలం గోళ్లపాడుకు చెందిన రుద్ర ఉపేందర్ వద్ద రఘునాథపాలెం మండలం కోటపాడుకు చెందిన కాముని రమేష్ 2016 అక్టోబర్ 30న రూ.1.75లక్షల అప్పు తీసుకున్నాడు. తిరిగి రమేష్ 2017 ఫిబ్రవరి 17న చెక్కు ఇవ్వగా బ్యాంకులో జమ చేస్తే సరిపడా నగదు లేక తిరస్కరణకు గురైంది. దీంతో ఉపేందర్ తన న్యాయవాది పొట్లపల్లి విప్లవ్‌కుమార్ ద్వారా లీగల్ నోటీస్ జారీ చేసి కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశాడు. ఈమేరకు విచారణలో నేరం రుజువు కావడంతో రమేష్‌కు మూడు నెలల జైలు శిక్ష విధించడమే కాక ఫిర్యాదికి రూ.1.75లక్షలు చెల్లించాలని తీర్పు చెప్పారు.

'బొజ్జ' నిండేలా నైవేద్యం !



సత్తుపల్లిలోని శ్రీకోదండ రామాలయం ప్రాంగణంలో గణపతి నవరాత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇక్కడ ప్రతిష్ఠించిన వాసవీగణపతికి భక్తులు శుక్రవారం 180 రకాల వంటకాలతో మహా నైవేద్యాన్ని సమర్పించారు. అంతేకాక కరెన్సీనోట్ల మాలలతో ఆకట్టుకునేలా స్వామిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే, సత్తుపల్లిలోని శ్రీప్రసన్న గణపతి క్షేత్రంలో 22ఏళ్లుగా గణేష్ నవరాత్రోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మహాగణపతి రూపంలో స్వామిని శుక్రవారం రూ.44 లక్షల కరెన్సీ నోట్ల మాలలతో అలంకరించారు. రూ.500 నోట్లు, రూ.100తో పాటు ఇతర నోట్లతో వివిధ ఆకృతుల్లో మాలలు చేసి అలంకరించగా పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

– సత్తుపల్లిటౌన్

కారుణ్య నియామక పత్రం అందజేత


నియామకపత్రం అందజేస్తున్న ఈఓ రమాదేవి

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతా రామచంద్ర స్వామివారి దేవస్థానంలో విధులు నిర్వహించేందుకు ఒకరికి కారుణ్య నియామక పత్రాన్ని ఆలయ ఈఓ బి.రమాదేవి శుక్రవారం అందజేశారు. విధి నిర్వహణలో మృతి చెందిన రమేష్‌బాబు భార్య సుష్మను ఆలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా నియమిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఈఓ నియామక పత్రం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆటోడ్రైవర్‌పై ఫిర్యాదు

ఖమ్మంక్రైం: ఆటోతో ఢీకొట్టడమే కాకుండా తనపై దౌర్జన్యం చేశాడని డ్రైవర్‌పై ఓ వ్యక్తి శుక్రవారం ఖమ్మం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఖమ్మం గాంధీనగర్‌కు చెందిన తిరగమళ్ల రమేష్‌బాబు సరితాక్లినిక్ మీదుగా వెళ్తుండగా ఆటోడ్రైవర్ పాల్వంచ కృష్ణ వెనక నుండి ఢీకొట్టాడు. ఇదేమిటని ప్రశ్నిస్తే తన అనుచరులను పిలిపించి దాడి చేయించగా గాయాలయ్యాయని రమేష్‌బాబు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

బాధ్యతలు స్వీకరించిన సీఐ రాజిరెడ్డి

ఖమ్మంక్రైం: స్పెషల్ బ్రాంచ్ సీఐ–1గా సీహెచ్.రాజిరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల బదిలీల్లో భాగంగా ఆయనను స్పెషల్ బ్రాంచ్‌కు కేటాయించారు. 1996 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన రాజిరెడ్డి ఉమ్మడి జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లలో ఎస్ఐగా, సీఐగా విధులు నిర్వర్తించారు. ఈ మేరకు బాధ్యతలు స్వీకరించిన అనంతరం రాజిరెడ్డి సీపీ సునీల్‌దత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

పాలేరు ఏటి ఒడ్డున యువతి మృతదేహం

నేలకొండపల్లి: మండలంలోని రామచంద్రాపురంలో పాలేరు ఏటి ఒడ్డున చెట్టుకు ఓ యువతి మృతదేహం వేలాడుతుండగా స్థానికులు శుక్రవారం గుర్తించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో పరీవాహక ప్రాంతంలో గల్లంతైన యువతి మృతదేహం ఈ ప్రాంతానికి కొట్టుకొచ్చినట్లు భావిస్తున్నారు. పంజాబీ డ్రెస్ ధరించి ఉన్న మృతురాలి ఇతర ఆనవాళ్లు గుర్తించడం కష్టంగా మారింది. కూసుమంచి సీఐ సంజీవ్, నేలకొండపల్లి ఎస్సై పి.సంతోష్ చేరుకుని పూర్తిగా పాడైన స్థితిలో ఉన్న మృతదేహానికి ఘటనాస్థలిలోనే పోస్టుమార్టం నిర్వహించారు.

విద్యార్థులకు సైకిళ్లు, బ్యాగ్‌లు



మున్నేటి వరద ముంపుతో గురై సర్వం కోల్పోయిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సాయం అందించేందుకు ఎస్ఆర్ఐ ఫౌండేషన్ ముందుకొచ్చింది. ముంపు ప్రాంతాల విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లు, పెన్నులు, పెన్సిళ్లతో బాలికలకు సైకిళ్లను అందించేందుకు సిద్ధం చేశారు. వీటిని ఖమ్మంలోని స్వర్ణభారతి కల్యాణమండపానికి తీసుకురాగా.. ఒకటి, రెండు రోజుల్లో పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్

60 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

కొణిజర్ల: మండలంలోని సింగరాయపాలెం ఎస్సీ కాలనీలో నిల్వ చేసిన 60క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్, కొణిజర్ల పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాలనీకి చెందిన అనిల్, రమేష్ స్థానికుల నుంచే కాక చుట్టుపక్కల గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి మిల్లులకు తరలిస్తున్నారు. ఈక్రమాన గురువారం రాత్రి బియ్యాన్ని తరలించేందుకు యత్నిస్తుండగా స్థానికులు ఇచ్చిన సమాచారంతో టాస్క్‌ఫోర్స్ సీఐ రామకృష్ణ నేతృత్వాన తనిఖీలు చేసి స్వాధీనం చేసుకున్నారు. అయితే, బాధ్యులు ఘటనా స్థలం నుంచి పరారు కావడంతో బియ్యాన్ని కొణిజర్ల పోలీసులకు అప్పగించారు. కాగా, గురువారం అర్ధరాత్రి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నా పోలీసులు మాత్రం శుక్రవారం సాయంత్రం వరకు గుట్టుగా ఉంచి, ఆతర్వాత కేసు నమోదు చేయడం చర్చనీయాంశంగా మారింది.

గూడురుపాడులో 50 క్వింటాళ్లు..

ఖమ్మంరూరల్: మండలంలోని గూడురుపాడు నుంచి అక్రమంగా తరలిస్తున్న 50క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శుక్రవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన వెంకటేష్, మంగళగూడెంకు చెందిన రాము, సంగయ్య గ్రామాల్లో కార్డుదారుల వద్ద నుండి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి నిల్వ చేశారు. ఈ బియ్యాన్ని పిండిప్రోలుకు చెందిన వ్యాపారికి చేరవేసేందుకు ట్రాక్టర్‌లో తీసుకెళ్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేశారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

ముదిగొండ: సెలవులకు ఇంటికి వచ్చిన విద్యార్థిని కాలేజీకి వెళ్లాలని తల్లి సూచించడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని రాఘవాపురానికి చెందిన దేశబోయిన రాకేశ్(18) ఖమ్మంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. వినాయకచవితి సందర్భంగా ఇంటికి వచ్చిన ఆయనను రెండు రోజులుగా కళాశాలకు రావాలని ఫోన్ చేస్తున్నారు. దీంతో వెళ్లాలని తల్లి మందలించడమే కాక సాయంత్రం హాస్టల్‌కి దిగబెడదామని చెప్పిన తల్లిదండ్రులు శుక్రవారం ఉదయం పొలం పనులకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయాన రాకేష్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయంత్రం ఇంటికి వచ్చాక ఈ విషయాన్న గుర్తించిన తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఘటనపై రాకేష్ తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ముదిగొండ సీఐ మురళి తెలిపారు.

నీటి గుంతలో పడి వృద్ధురాలు మృతి

తల్లాడ: మండలంలోని కలకొడిమలో శుక్రవారం రాత్రి నీటి గుంతలో పడిన వృద్ధురాలు మృతి చెందింది. గ్రామానికి చెందిన గొల్లమండల ముత్తమ్మ(70) ఇంటి సమీపాన ఇటీవల కురిసిన వర్షాలతో సైడ్‌కాల్వ వెంట గుంతలో నీరు నిలిచింది. ముత్తమ్మ బయటకువెళ్లి వస్తుండగా చీకటిలో గుంత కన్పించకపోవడంతో కాలుజారి అందులో పడగా ఊపిరి ఆడక అక్కడికక్కడే మృతి చెందింది.

విద్యుదాఘాతంతో రైతు..

తల్లాడ: మండలంలోని ముద్దునూరు గ్రామపంచాయతీ పరిధి రంగాపురంలో శుక్రవారం విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. గ్రామస్తులు కథనం ప్రకారం... గ్రామానికి చెందిన యరమల వెంకట్‌రెడ్డి(58) సాయంత్రం చెన్నూరు వాగు సమీపాన తన వరి పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లాడు. అక్కడ విద్యుత్ మోటార్ పనిచేయకపోవడంతో పరిశీలిస్తుండగా పక్కనే ఉన్న విద్యుత్ వైరు తాకగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. వాగులో ఇసుక కోసం వెళ్లిన వారు ఈ విషయాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా వారు చేరుకుని కన్నీరుమున్నీరుగా రోదించారు. కాగా, వెంకట్‌రెడ్డికి భార్య, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు.

అదుపుతప్పి బస్సును ఢీ కొట్టిన కంటెయినర్

ఏడుగురు దుర్మరణం

- అదే సమయంలో బస్సును ఢీ కొట్టిన మరో లారీ
- చిత్తూరు జిల్లా మొగిలి ఘాట్‌లో ఘోర రోడ్డు ప్రమాదం
- మృతుల్లో తెలంగాణవాసి
- 31 మందికి గాయాలు, 9 మంది పరిస్థితి విషయం



ప్రమాద ధాటికి నుజ్జునుజ్జు అయిన బస్సు, లారీ

పలమనేరు: ఘాట్ రోడ్‌లో అదుపు తప్పిన కంటెయినర్ మృత్యువాహనమైంది. డీజిల్ ఆదా కోసం ఆ కంటెయినర్ డ్రైవర్ చేసిన పని నడి రోడ్డుపై రక్తాన్ని ఏరులై పారించింది. శుక్రవారం చిత్తూరు జిల్లా పలమనేరు సమీపంలోని మొగిలి ఘాట్ రోడ్డులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఏడుగురు అక్కడికక్కడే మృత్యు ఒడికి చేరుకున్నారు. మరో 31 మంది గాయపడగా.. వారిలో 9 మంది పరిస్థితి విషమంగా ఉంది. బెంగళూరు నుంచి ఓ కంటెయినర్ సుమారు 100 టన్నుల ఇనుప కమ్మీలతో చెన్నైకి బయలుదేరింది. మొగిలి ఘాట్ పల్లంగా ఉండటంతో డీజిల్ ఆదా కోసం డ్రైవర్ వాహనాన్ని న్యూట్రల్ చేశాడు. లారీ 100 కి.మీ. పైగా వేగంగా వెళుతుండగా బ్రేక్ ఫెయిల్ అయ్యింది. దీంతో లారీ అదుపుతప్పి డివైడర్‌ని దాటి చిత్తూరు–బెంగళూరు రోడ్డుపైకి దూసుకెళ్లింది. ఇదే సమయంలో తిరుమల నుంచి బెంగళూరుకు 52 మంది ప్రయాణికులతో వెళుతున్న అలిపిరి డిపోకు చెందిన ఏపీఎస్ ఆర్టీసీ బస్సును వేగంగా ఢీ కొట్టింది. ఆ వేగానికి బస్సు వెనక్కి తిరిగిపోయింది. అదే సమయంలో బస్సు వెనుక వస్తున్న మరో లారీ ఆ బస్సును బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఏడుగురు అక్కడికక్కడే మృతి చెందారు. కొందరు బస్సులోనే నుజ్జు నుజ్జయి ప్రాణాలు విడిచారు. మరి కొందరు కంటెయినర్‌లోని ఇనుప కమ్మీలు కింద పడి ప్రాణాలు కోల్పోయారు. మరణించిన వారిలో ముగ్గురి శరీరభాగాలు గుర్తుపట్టలేనంతగా ఛిద్రమయ్యాయి. ప్రమాద సమయంలో బైక్‌పై వెళ్తున్న యువకుడు రెండు వాహనాల మధ్య ఇరుక్కుపోయి తీవ్ర గాయాల పాలయ్యాడు. మరణించిన వారిలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన బల్లరాజు(55) ఉన్నారు.



పిఠాపురంలో భారీగా హాజరైన జనసందోహానికి వైఎస్ జగన్ అభివాదం

నిన్న బుడమేరు.. నేడు ఏలేరు

నిర్లక్ష్యమే ముంచేసింది

ఇది ఏమాత్రం బాధ్యత లేని ప్రభుత్వం • ఏలేరు వరద ప్రాంతాల పర్యటనలో వైఎస్ జగన్ ధ్వజం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: వరదల నియంత్రణలో రాష్ట్ర ప్రభుత్వం దారుణంగా విఫలమైందని.. వరద హెచ్చరికలను పెడచెవిన పెట్టి విజయవాడను ముంచేసిన మాదిరిగానే ఏలేరు వరద విషయంలో అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరించి రైతుల నోట్లో మట్టి కొట్టిందని మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిప్పులు చెరిగారు. రాష్ట్రంలో ఒక బాధ్యత లేని ప్రభుత్వం ఉందని మండిపడ్డారు. ఏలేరు రిజర్వాయర్‌కు వరద వస్తుందని, అది ప్రమాదకర స్థాయిలో ఉంటుందని ప్రభుత్వానికి ముందే సమాచారం అందినా కాలువ ద్వారా నీటిని వదలకుండా తాత్సారం చేసి చివరకు సామర్థ్యానికి మించి వదిలి ముంచేశారని ధ్వజమెత్తారు. ఇరిగేషన్, రెవెన్యూ, హోంశాఖలతో కనీసం సమీక్షించకుండా సీఎం చంద్రబాబు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారని మండిపడ్డారు. విజయవాడ ఎలా అతలాకుతలమైందో అలాంటి నిర్లక్ష్యమే ఏలేరు విషయంలోనూ కనిపిస్తోందన్నారు. పిఠాపురం నియోజకవర్గంలోని ఏలేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో వైఎస్ జగన్ శుక్రవారం పర్యటించారు. మాధవాపురం, పాత ఇసుకపల్లి, నాగులాపల్లి, రమణక్కపేట తదితర గ్రామాల్లో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించి రైతులను ఓదార్చారు. దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించి బాధిత కుటుంబాలకు ధైర్యం చెప్పారు. అనంతరం రమణక్కపేటలో మీడియాతో మాట్లాడారు. ప్రీమియం చెల్లించకుండా ఉచిత పంటల బీమాను గాలికొదిలేసి రైతులను ప్రభుత్వం నట్టేట ముంచేసిందని దుయ్యబట్టారు. ఈ క్రాప్ నమోదు చేయడం లేదని, ఆర్బీకేలను అడ్రస్ లేకుండా చేశారని, సచివాలయాలను నిర్వీర్యం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రన్న వస్తాడు.. రూ.20 వేలు పెట్టుబడి సాయం ఇస్తాడన్న హామీ ఏమైందని నిలదీశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

మనుషుల విలువ తెలిసి ఉంటే..

ఏలేరు రిజర్వాయర్ దగ్గర పరిస్థితిని చూస్తే విజయవాడ గుర్తుకొస్తోంది. అతి భారీ వర్షాలు కురుస్తాయని ఆగస్టు 31నే రాష్ట్ర ప్రభుత్వాన్ని ఐఎండీ (భారత వాతావరణ విభాగం) అప్రమత్తం చేసింది. అలాంటి హెచ్చరిక అందగానే ప్రభుత్వం సమీక్ష నిర్వహించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. రెవెన్యూ, హోం, ఇరిగేషన్ కార్యదర్శులతో సమీక్ష చేయాలి. కానీ ముందే సమాచారం ఉన్నా ప్రభుత్వం పట్టించుకోలేదు. కలెక్టర్లతో మాట్లాడలేదు. సీఎస్ కూడా ఏమాత్రం పట్టించుకోలేదు. సీఎం చంద్రబాబుకు మానవత్వం ఉంటే, మనుషుల విలువ తెలిసి ఉంటే స్పెషల్ ఆఫీసర్‌ను నియమించి ఎప్పటికప్పుడు పరిస్థితి తెలుసుకుని ముందు జాగ్రత్తలు చేపట్టే వారు. కానీ అవేమీ చేయలేదు. అన్నీ గాలి కొదిలేశారు.

సామర్థ్యానికి మించి ఒకేసారి నీటి విడుదలతో..

ఏలేరు రిజర్వాయర్ సామర్థ్యం దాదాపు 24 టీఎంసీలు కాగా 31వతేదీ నాటికే సుమారు 18 టీఎంసీలు ఉన్నాయి. సెప్టెంబర్ 1న ఏలేరు రిజర్వాయర్‌కు 9,950 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. ప్రభుత్వం జాగ్రత్త పడి ఉంటే, ఫ్లడ్ కుషన్ నిబంధన పాటించి ఉంటే ఆ మొత్తం వెంటనే కిందకు వదలాలి. ఎందుకంటే దిగువన కాలువ సామర్థ్యం 14 వేల క్యూసెక్కులు మాత్రమే. అలా అప్పుడే నీళ్లు దిగువకు వదిలి ఉంటే ఆ కాలువ పొంగకుండా ఉండేది. కానీ ప్రభుత్వం కేవలం 300 క్యూసెక్కులు మాత్రమే వదిలిపెట్టింది. సెప్టెంబరు 4న 5,400 క్యూసెక్కులు వస్తే బయటకు పంపింది కేవలం 300 క్యూసెక్కులు మాత్రమే. ఏమాత్రం ఫ్లడ్ మేనేజ్‌మెంట్ చేపట్టలేదు. ఫ్లడ్ ఫ్లో కుషన్ ఏర్పాటు చేయలేదు. పైనుంచి నీళ్లొస్తున్నా తీవ్ర నిర్లక్ష్యం వహించారు. కేవలం 300 క్యూసెక్కులు మాత్రమే వదులుతూ వచ్చారు. దీంతో 9వతేదీ నాటికి ఏలేరు రిజర్వాయర్ పూర్తిగా నిండింది. దీంతో గత్యంతరం లేక కిందకు 21,500 క్యూసెక్స్ వదిలారు. 10వ తేదీన 26,134 క్యుసెక్కుల ఇన్‌ఫ్లో ఉంటే ఏకంగా 27,275 క్యూసెక్స్ విడిచిపెట్టారు. అంటే కాలువ సామర్థ్యాన్ని మించి నీళ్లు వదలడంతో లోతట్టు ప్రాంతాలను ముంచెత్తింది. మరి ఇది కచ్చితంగా "మేన్ మేడ్ ఫ్లడ్" కాకపోతే మరేమిటయ్యా! అని అడుగుతున్నా. ప్రజలు పట్ల మానవత్వం చూపని, ఏమాత్రం బాధ్యత లేని ప్రభుత్వం ఇది. వరదలు వస్తే ఎలా హ్యాండిల్ చేయాలో కనీసం ఇంగితం లేని ప్రభుత్వం ఇది!

ఏలేరు ఆధునీకరణపై అబద్ధాలు..

అబద్ధాలు చెప్పడంలో సీఎం చంద్రబాబు గోబెల్స్‌కు తమ్ముడే. పచ్చి అబద్ధాలాడతారు. అబద్ధాలను సృష్టించడం, వాటిని అమ్ముగలగడంలో చంద్రబాబును మించిన వారు ప్రపంచంలోనే లేరు. ఆయనకు వంత పాడే మీడియా నిత్యం అవే అబద్ధాలను ప్రచారం చేస్తోంది. ఏలేరు ఆధునికీకరణపైనా చంద్రబాబు అబద్ధాలు చెబుతున్నారు. తొలుత ఏలేరు కాలువ ఆధునికీకరణను 2008లో దివంగత వైఎస్సార్ రూ.138 కోట్లతో చేపట్టారు. ఆ తర్వాత ఎవరూ ఆ పనులను పట్టించుకోలేదు. వర్షాలు, నీళ్లు లేనప్పుడు మాత్రమే కెనాల్ ఆధునికీకరణ చేయగలం. లేదంటే క్రాప్ హాలిడే ప్రకటిస్తే కానీ సాధ్యం కాదు. 2014లో చంద్రబాబు సీఎం అయ్యాక అంచనాలు రూ.295 కోట్లకు పెంచడం మినహా పనులు చేయలేదు. నిజానికి అప్పుడు రిజర్వాయర్‌లో నీళ్లు కూడా పెద్దగా లేవు. నాడు చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ఏటా కరువే. చంద్రబాబు – కరువు ఇద్దరూ కవలలే. అప్పుడు వర్షాలు కూడా లేవు. అయినా పనులు ఎందుకు చేయలేదు? 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక వరుసగా వర్షాలు కురవడంతో క్రాప్ హాలిడే ప్రకటించే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో కాలువ ఆధునికీకరణ పనులు వేగంగా చేయలేకపోయాం.

ఏం జరిగినా జగనే కారణం అంటాడు

ఏలేరు వరదలపై ప్రభుత్వానికి ముందే ఇంత సమాచారం ఉన్నా తగిన జాగ్రత్తలు తీసుకోలేదు. ఫ్లడ్ కుషన్ మేనేజ్‌మెంట్‌లో చంద్రబాబు విఫలమై రైతులందర్నీ ఇబ్బంది పెట్టారు. వరదలు వస్తే రిజర్వాయర్లను ఎలా నిర్వహించాలో ఈ ప్రభుత్వానికి తెలియడం లేదు. చంద్రబాబు ప్రభుత్వం వచ్చి దాదాపు నాలుగు నెలలు అయింది. ఎక్కడ ఏం జరిగినా దానికి కారణం జగనే కారణం అంటాడు. విజయవాడలో వరదలు వచ్చినా జగనే కారణం.. ! ఏలేరు రిజర్వాయర్ కింద వరదలు వచ్చినా జగనే కారణం..! కోవిడ్ వచ్చినా జగనే కారణం.. అంటాడు! చంద్రబాబు చేయాల్సింది జగన్నామస్మరణ కాదు. ప్రతి దానికి జగన్‌పై అరవకుండా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. ఇప్పటికైనా మమ్మల్ని నిందించడం మానుకుని ప్రజలకు క్షమాపణ చెప్పి నిజాయితీగా పాలన అందించాలి.

సకాలంలో మెడికల్ కౌన్సెలింగ్ పూర్తి

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర



సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల కౌన్సెలింగ్ కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందనక్కర్లేదని, వారం రోజుల్లో కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శుక్రవారం రాత్రి ఒక ప్రకటనలో వెల్లడించారు. మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ ఇచ్చిన గడువులోగా ఎంబీబీఎస్ కౌన్సెలింగ్‌ను పూర్తి చేసి, తరగతులను ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎలాంటి వదంతులు, అసత్య ప్రచారాలను నమ్మొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రాంత విద్యార్థులకే సీట్లు దక్కాలన్నది తమ ఆలోచన అని, ఈ విషయంలో రాజీ పడేది లేదని పేర్కొన్నారు. వారం రోజుల్లో కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని, ఈలోగా వెబ్ ఆప్షన్ల నమోదు కోసం విద్యార్థులు సిద్ధంగా ఉండాలని మంత్రి సూచించారు. శనివారం ఉదయం 11 గంటల నుంచి రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల వివరాలు, సీట్ల వివరాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో (https://www.knruhs.telangana. gov.in/) అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. గతేడాది ఏయే ర్యాంకు విద్యార్థులకు ఏయే కాలేజీల్లో సీట్లు వచ్చాయన్న వివరాలను కూడా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని వివరించారు. ఆయా వివరాలను పరిశీలించి, తమ ర్యాంకులకు అనుగుణంగా వెబ్ ఆప్షన్ల కోసం జాబితాను సిద్ధం చేసుకోవాలని మంత్రి సూచించారు.

ట్రాన్స్‌జెండర్ల కోసం జిల్లాకో క్లినిక్

వైద్య ఆరోగ్యశాఖ కీలక నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రతి జిల్లాకో క్లినిక్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం ఉన్న జిల్లా ఆస్పత్రులు లేదా బోధన ఆస్పత్రుల్లోనే వీటిని ఏర్పాటు చేయనున్నారు. అవసరాన్ని బట్టి వారానికి రెండు లేదా మూడు రోజుల పాటు క్లినిక్స్ నిర్వహించనున్నారు. ప్రతి క్లినిక్‌లో జనరల్ ఫిజీషియన్, డెర్మటాలజిస్ట్, సైకియాట్రిస్ట్ అందుబాటులో ఉంటారు. అవసరాన్ని బట్టి గైనకాలజిస్ట్, యూరాలజిస్ట్, ఇతర స్పెషలిస్ట్ డాక్టర్లను డిప్యూట్ చేస్తారు. వైద్య ఆరోగ్యశాఖ, మహిళా శిశు సంక్షేమశాఖ సంయుక్తంగా ఈ క్లినిక్స్‌ను ఏర్పాటు చేస్తున్నాయి. ఇప్పటికే ఉత్తర్వులు కూడా జారీ చేశారు. తాము అనారోగ్యం బారిన పడ్డప్పుడు ఆస్పత్రులకు వెళ్లలేకపోతున్నామని, ఒకవేళ ధైర్యం చేసి వెళ్లినా అవమానాలు ఎదుర్కోవాల్సి వస్తోందని ట్రాన్స్‌జెండర్లు ఇటీవల ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. ఆస్పత్రుల్లో తమకోసం ప్రత్యేకంగా ఓ రూమ్ కేటాయించాలని కోరారు. ఈ నేపథ్యంలోనే ప్రత్యేకంగా ట్రాన్స్‌జెండర్ల కోసం క్లినిక్స్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అంతేకాదు, అవసరమైన వారికి జెండర్ మార్పిడి ఆపరేషన్లు కూడా ఉచితంగా చేయించనున్నారు. ఇందు కోసం కేంద్ర ఆరోగ్యశాఖ ఇటీవలే ఓ ప్రొసీజర్‌ను విడుదల చేసింది. తొలుత హార్మోనల్ బ్యాలన్స్ కోసం చికిత్స అందించడం, కౌన్సెలింగ్ ఇవ్వడం వంటివి చేసి, అప్పటికీ సెట్ అవ్వకపోతేనే జెండర్ మార్పిడి సర్జరీలు చేయాలని పేర్కొంది. ఇప్పటికే ఉస్మానియా ఆస్పత్రిలో ట్రాన్స్‌జెండర్ల కోసం క్లినిక్ నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఉచితంగా ఆపరేషన్లు కూడా చేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేశారు. జిల్లాల నుంచి రోగులను ఇక్కడికే రిఫర్ చేయనున్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు ట్రాన్స్‌జెండర్లు

▶ మొదటి పేజీ తరువాయి

ఈ విధులు అప్పగించాలని ముఖ్యమంత్రి సూచించారు. వలంటీర్లుగా పనిచేసే ట్రాన్స్‌జెండర్లకు ప్రతినెలా కొంత స్టైఫండ్ ఇవ్వాలని, దీంతో వారికి ఆర్థికంగా భరోసా కల్పించడంతో పాటు సమాజంలో గౌరవస్థానం కల్పించవచ్చునని సీఎం పేర్కొన్నారు. ఆసక్తిగా ఉన్న ట్రాన్స్‌జెండర్ల వివరాలను సేకరించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. వారం, పది రోజుల పాటు వారికి అవసరమైన ప్రత్యేక శిక్షణను కూడా అందించాలని, విధుల్లో ఉండే ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక యూనిఫామ్ కూడా ఉండాలని అధికారులకు సూచించారు. శుక్రవారం సచివాలయంలో జీహెచ్‌ఎంసీ పరిధిలోని రోడ్లు, ఫుట్‌పాత్‌లు, ఇతర అభివృద్ధి పనులు, పారిశుద్ధ్యం తదితర అంశాలపై సమీక్షా సమావేశం సందర్భంగా సీఎం ఈ విషయం వెల్లడించారు. సీఎం నిర్ణయంతో ఈ కార్యక్రమం విజయవంతమైతే దేశంలో ఇతర నగరాలు కూడా దీనిని ఆదర్శంగా తీసుకునే అవకాశం ఉంది.

జిల్లా వార్తలు

వైద్యుల నియామకానికి 21న ఇంటర్వ్యూలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి పరిధిలోని వివిధ ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్యనిపుణుల పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేయనున్నారు. ఏడాదికి కాలానికి నియామకాలు చేపడుతుండగా ఈనెల 21న కొత్తగూడెంలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. రేడియాలజిస్ట్, ఆర్థో సర్జన్ పోస్టులు మూడు చొప్పున, అనస్తీషియన్, ఈఎన్‌టీ సర్జన్, జనరల్ సర్జన్, ఫిజీషియన్, ఆప్తాల్మజిస్ట్, పీడియాట్రీషియన్ పోస్టులు రెండు చొప్పున, చెస్ట్ ఫిజీషియన్ పోస్ట్ ఒకటి భర్తీ చేయనుండగా ఆయా విభాగాల్లో అర్హత కలిగి, 64ఏళ్ల లోపు వయస్సు ఉన్న వైద్యులు ఈనెల 18న లోపు www.scclmines.com వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు సూచించారు. ఎంపికైన వారికి నెలకు రూ.1.25లక్షల వేతనం చెల్లించనున్నట్లు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో రాష్ట్ర బృందం తనిఖీ



సెంటర్‌లో చిన్నారులతో అధికారులు

ఖమ్మంవన్‌టౌన్: ఖమ్మం అర్బన్ పరిధిలోని శాంతినగర్–1 అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం రాష్ట్ర స్థాయి బృందం తనిఖీ చేసింది. ఈ సందర్భంగా కేంద్రంలో చిన్నారుల బరువు, వారికి అందిస్తున్న పౌష్టికాహారం నాణ్యతను పరిశీలించారు. బృందంలో ఏడీలు జ్యోతి, విజయలక్ష్మి ఉండగా అర్బన్ సీడీపీఓ వీరభద్రమ్మ, ముస్తఫానగర్ సూపర్‌వైజర్ విజయలక్ష్మీ పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తి 83 శాతమే...



ఓసీలో బొగ్గు లోడ్ చేస్తున్న వాహనం

ఆగస్టు నెలలో ఏరియాల వారీగా బొగ్గు ఉత్పత్తి వివరాలు (టన్నుల్లో)

ఏరియా	లక్ష్యం	ఉత్పత్తి	శాతం
కొత్తగూడెం	9,96,500	9,93,318	101
ఇల్లెందు	2,59,000	3,29,200	127
మణుగూరు	7,98,500	5,34,316	67
బెల్లంపల్లి	2,40,000	1,15,452	48
మందమర్రి	2,51,500	1,90,008	76
శ్రీరాంపూర్	4,54,900	2,68,817	59
ఆర్జీ-1	3,65,700	2,90,648	79
ఆర్జీ-2	4,78,400	4,40,009	92
ఆర్జీ-3	4,14,520	4,44,520	99
అడ్రియాల	17,400	10,948	63
భూపాలపల్లి	2,61,700	1,74,641	67

సింగరేణి వ్యాప్తంగా గత నెలలో 37.61 లక్షల టన్నులు

- రెండు ఏరియాల్లోనే 100 శాతం ఉత్పత్తి
- గడిచిన ఐదు నెలల్లో కూడా నెరవేరని లక్ష్యం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ ఆగస్టులో నిర్దేశిత 45.42 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంలో 37.61 లక్షల టన్నులు(83 శాతం) మాత్రమే సాధించగలిగింది. అంటే సుమారు 8 లక్షల టన్నుల వెనుకంజలో ఉంది. ఇక ఈ ఆర్థిక సంవత్సరం గడిచిన ఐదు నెలల్లో పరిశీలిస్తే 26.38 మిలియన్ టన్నుల లక్ష్యానికి 24.70 మిలియన్ టన్నులే(94 శాతం) సాధించడం గమనార్హం. అయితే, గత మూడు నెలల్లో, ఈ నెల మొదటివారం భారీ వర్షాలు కురవగా.. ఓసీల్లో నీరు నిలవడంతో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడుతోందని చెబుతున్నారు.

ఓసీల్లో అధికం

సంస్థ పరిధిలోని 18 ఓపెన్‌కాస్ట్ గనుల్లో అత్యధికంగా బొగ్గు ఉత్పత్తి నమోదవుతోంది. ఓసీల్లో గడిచిన ఐదు నెలలకు గాను 23.75 మిలియన్ టన్నుల లక్ష్యంలో 22.57 మిలియన్ టన్నులు(95 శాతం) సాధించారు. ఇక 22 భూగర్భ గనుల్లో 26.36 లక్షల టన్నుల లక్ష్యానికి 21.23 లక్షల టన్నులు(81శాతం) ఉత్పత్తి నమోదైంది. రోజువారీగా పరిశీలిస్తే ఓసీల్లో 60శాతం, భూగర్భగనుల్లో 75 శాతం సాధించాయి.

రెండు ఏరియాల్లో పర్వాలేదు..

సింగరేణి సంస్థ ఆరు జిల్లాల్లో విస్తరించి ఉండగా 11 ఏరియాలకు కలిపి 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించింది. సంస్థ వ్యాప్తంగా 22 భూగర్భగనులు, 18 ఓసీలు ఉండగా.. కొన్ని ఏరియాలు 100శాతం ఉత్పత్తి సాధిస్తున్నా ఇంకొన్ని వెనకబడుతున్నాయి. ఆగస్టులో కొత్తగూడెం ఏరియా 101శాతం, ఇల్లెందు ఏరియా 127 శాతం ఉత్పత్తి సాధించాయి. ఇక మణుగూరు ఏరియా 67శాతం, బెల్లంపల్లి 48, మందమర్రి 76, శ్రీరాంపూర్ 59, ఆర్జీ–1 ఏరియా 79, ఆర్జీ–2 ఏరియా 92, ఆర్జీ–3 ఏరియా 99శాతం, అడ్రియాల 63, భూపాలపల్లి 67శాతం ఉత్పత్తి సాధించాయి. కాగా, గడిచిన ఐదు నెలల్లో ఇల్లెందు ఏరియా 116 శాతం, ఆర్జీ–2 ఏరియా 126 శాతం సాధించాయి. మిగిలిన వాటిలో కొత్తగూడెం ఏరియా 94, మణుగూరు 93, బెల్లంపల్లి 93శాతం, మందమర్రి 80, శ్రీరాంపూర్ 73, ఆర్జీ–1 ఏరియా 87, ఆర్జీ–3 ఏరియా 96, అడ్రియాల 95, భూపాలపల్లి ఏరియా 69 శాతానికి పరిమితమయ్యాయి. కొత్తగూడెం ఏరియాకు ఈ ఆర్థిక సంవత్సరం 145 లక్షల టన్నుల లక్ష్యాన్ని నిర్దేశించగా ఈ ఐదు నెలల్లో 51.70 లక్షల టన్నుల ఉత్పత్తి నమోదు చేసి అగ్రస్థానంలో నిలిచింది.

జీఎం పోస్టులకు పోటాపోటీ

- సింగరేణి భవన్ చుట్టూ ఆశావహుల ప్రదక్షిణలు
- పోస్టులు ఆశిస్తున్న ఇద్దరు మహిళా అధికారులు?



కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం

సింగరేణి(కొత్తగూడెం): ఆరు జిల్లాల పరిధిలో విస్తరించిన సింగరేణి సంస్థలోని 11 ఏరియాలకు అంతే సంఖ్యలో జీఎంలు ఉండగా, మరో 35 మంది సంస్థ వ్యాప్తంగా వివిధ విభాగాల జీఎంలు విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా, ఎక్కడ జీఎంగా పనిచేసినా జీతభత్యాలు సమానంగానే ఉంటుండగా.. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో పనిచేసే వారికి మాత్రం అలవెన్స్‌లు కాస్త ఎక్కువగా అందుతాయి. ఇక విధుల విషయంలో కార్పొరేట్ కార్యాలయంలోని వారితో పోలిస్తే ఏరియాల జీఎంలకు కొద్దిమేర స్వాతంత్రం ఉంటుందని చెబుతారు. ఈ నేపథ్యాన గతంలో సింగరేణి సీఎండీ, డైరెక్టర్ల సూచనల మేరకు పోస్టింగ్ ఇచ్చేవారు. కానీ ఇటీవల సింగరేణిలో రాజకీయ జోక్యం పెరగడంతో కొందరు రాష్ట్ర మంత్రులతో పదవుల కోసం సిఫారసు చేయించుకుంటున్నట్లు తెలుస్తోంది.

పర్సనల్ విభాగం జీఎంల కోసం..

సింగరేణి సంస్థలో కీలకమైన కార్పొరేట్ కార్యాలయంలో జీఎం పర్సనల్(ఐఆర్‌పీఎం) పోస్టు గత నెల 31న ఖాళీ అయింది. అంతకంటే ముందు మరో విభాగం జీఎం వీఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. గతంలో వెల్ఫేర్, ఆర్సీకి కలిపి ఒక జీఎం, ఐఆర్‌పీఎం, సెక్యూరిటీ విభాగాలకు కలిపి ఒక జీఎం ఉండేవారు. ఇప్పుడు ఈ రెండు పోస్టులు ఖాళీ అవుతుండడంతో ఇద్దరు మహిళా జీఎంలు వారికి ఉన్న పోస్టులు కాకుండా వీటి కోసం సింగరేణి భవన్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్లు సమాచారం.

డైరెక్టర్ పోస్టుల నుండి పైరవీలు మొదలు..

సంస్థలో ప్రధానంగా సీఎండీతో పాటు డైరెక్టర్లలో పా, ఆపరేషన్స్, ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్, ఈ అండ్ ఎం, ఫైనాన్స్ పోస్టులు కీలకమైనవిగా చెప్పాలి. ఇక మరో ముగ్గురు డైరెక్టర్లు సింగరేణి భవన్‌లో ఉంటారు. అయితే ప్రధానమైన సీఎండీ, ఒకరిద్దరు డైరెక్టర్లను ప్రభుత్వం ఐఏఎస్ అధికారులను నియమిస్తుంది. ఆపై మిగతా పోస్టుల్లో ఉద్యోగుల్లో అనుభవం, పనితీరు ఆధారంగా నియమించడం సంప్రదాయంగా వస్తోంది. అయితే, ఈ ప్రక్రియలో భారీగా పైరవీలు జరిగాయని తెలుస్తుండగా.. జాబితాలో కింద ఉన్న వారిని ఎంపిక చేయడంతో ఒకరిద్దరు అధికారులు ఇబ్బంది పడినట్లు ప్రచారం జరిగింది. ఇక ఇప్పుడు జీఎం పోస్టుల కోసం అధికారులు పైరవీలు మొదలుపెట్టడం చర్చనీయాంశంగా మారింది.

సిద్ధమైన ఖమ్మం-డోర్నకల్ రహదారి

రఘునాథపాలెం మండలంలోని కోయచలక–కోటపాడు మధ్య ఆర్‌అండ్‌బీ రహదారి వరదతో కోతకు గురికాగా ఇన్నాళ్లు ఖమ్మం – డోర్నకల్ నడుమ రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అయితే, రహదారి భారీగా కోతకు గురి కావడంతో శ్లాబ్ కల్వర్టు నిర్మాణానికి సమయం పడుతుందని భావించిన అధికారులు తాత్కాలికంగా సమీపం నుండి డైవర్షన్ రోడ్డు నిర్మించారు. నీరు సాఫీగా సాగేలా పైపులు వేసి మట్టి నింపి తాత్కాలికంగా నిర్మించిన రోడ్డు పనులు పూర్తవడంతో శుక్రవారం సాయంత్రం రాకపోకలు మొదలయ్యాయి. – రఘునాథపాలెం



సిద్ధమైన డైవర్షన్ రహదారి

ప్రతీ మండపానికి జియో ట్యాగింగ్

- వివరాలు నమోదు చేస్తున్న పోలీసులు
- జిల్లాలో 2,500 వినాయక విగ్రహాలు

నేలకొండపల్లి : గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జరిగే నిమజ్జన కార్యక్రమాల్లో ఎలాంటి అపశ్రుతి జరగకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా అన్ని మండపాల వివరాలు సేకరించి వెబ్‌సైట్‌లో నమోదు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే 2,500 వినాయక మండపాలకు జియో ట్యాగింగ్ పూర్తి చేశారు. ప్రతీ మండపం వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పోలీసు అధికారులు సూచించారు. ఈ మేరకు ఆయా పోలీస్‌స్టేషన్ పరిధిలో మండపాల వద్దకు సిబ్బంది వెళ్లి వివరాలు, మండపాల ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే ప్రక్రియ పూర్తయింది.



రాజేశ్వరపురంలో వినాయక మండపం వద్ద జియో ట్యాగింగ్ చేస్తున్న నేలకొండపల్లి పోలీసులు

నిమజ్జనానికి రూట్‌మ్యాప్ కూడా..

జిల్లాలోని వినాయక మండపాలకు సంబంధించిన వివరాలతో నిమజ్జన సమయంలో రూట్ మ్యాప్ కూడా సిద్ధం చేస్తున్నారు. మండపాల నిర్వాహకుల వివరాలు, సెంటర్, ఎన్ని రోజులు ఉత్సవాలు నిర్వహిస్తారు. ఎక్కడ నిమజ్జనం చేస్తారు.. ఇలా ప్రతీ విషయాన్ని పోలీస్ యాప్‌తో అనుసంధానం చేస్తున్నారు. తద్వారా భద్రత చర్యలు తీసుకోవడం సులభమవుతుందని పోలీస్, బ్లూకోల్ట్స్, పెట్రోకార్ సిబ్బంది తెలిపారు. మండపాల వద్ద ఎలాంటి సమస్య తలెత్తినా సమాచారం అందే అవకాశం ఉంటుంది. పోలీస్ అప్లికేషన్‌లోని లొకేషన్ ఆప్షన్ నొక్కగానే మండప ప్రాంతం తెలుస్తుంది. దీంతో వెంటనే అక్కడికి పోలీసు సిబ్బంది చేరుకునేలా ఏర్పాటు చేశారు.

నిర్వాహకులు సహకరించాలి



మండపాల వద్ద ఇబ్బందులు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. ప్రతీ మండపాన్ని జియో ట్యాగింగ్ చేశాం. ఎక్కడ సమస్య వచ్చినా తెలుస్తుంది. పోలీస్ సిబ్బంది 24 గంటలూ అప్రమత్తంగా ఉంటారు. నిమజ్జనం కూడా శాంతియుతంగా పూర్తయ్యేలా నిర్వాహకులు సహకరించాలి.

– పి.సంతోష్, ఎస్సై, నేలకొండపల్లి